సాక్షి పెద్దపల్లి

శనివారం । 21 । డిసెంబర్ । 2024



వేగవంతంగా సర్వే

ఓదెల/సుల్తానాబాద్‌రూరల్: ఇందిరమ్మ ఇళ్ల సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో వేగవంతంగా నమోదు చేయాలని డీపీవో వీరబుచ్చయ్య సూచించారు. గ్రామాల్లో సర్వేను ఆయన పరిశీలించారు.



అలరించిన వెల్‌బేబీ షో

రామగిరి: సింగరేణి డేను పురస్కరించుకుని సెంటినరీకాలనీ డిస్పెన్సరీలో చేపట్టిన వెల్‌బేబీ షో అలరించింది. జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు షో ప్రారంభించారు.

గరిష్టం/కనిష్టం
32.0/21.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. ఉదయం, రాత్రి వేళ చలితీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'డయల్ యువర్ డీఎం'కు స్పందన



మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్

మంథని: స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలో శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి ప్రయాణికుల నుంచి మంచి స్పందన వచ్చినట్లు డిపో మేనేజర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు.15 మంది ఫోన్ ద్వారా సమస్యలు, సూచనలు చేసినట్లు చెప్పారు. మంథని– జమ్మికుంట మధ్య రాత్రివేళ బస్సు సర్వీస్ పునరుద్ధరించాలని, మంథని – జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెలకు బస్సు నడిపించాలని, కాళేశ్వరం – వేములవాడకు బస్సులు నడిపించాలని ప్రయాణికులు సూచించారని అన్నారు. పెద్దపల్లి నుంచి మంథనికి భాగ్యనగర్ ట్రైన్‌కు లింక్ బస్సు నడిపించాలని సూచనలు చేశారన్నారు. ఈ సమస్యలు, సూచనలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని డీఎం వివరించారు.

మహిళల రక్షణే లక్ష్యం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

జ్యోతినగర్(రామగుండం): మహిళల రక్షణే షీటీం లక్ష్యమని గోదావరిఖని ఏసీపీ రమేశ్ అన్నారు. ఎన్టీపీసీ జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బస్‌స్టేషన్లు, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, కళాశాలలు పరిధిలో షీటీం నిరంతరం విధులు నిర్వర్తిస్తోందని తెలిపారు. వేధింపులకు గురైన వారు 63039 23700 నంబర్‌కు ఫోన్‌చేసి సమస్య తెలియజేయాలని ఆయన సూచించారు. బాధితుల వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై ఉదయ్‌కిరణ్, షీటీం ఇన్‌చార్జిలు మల్లయ్య, సురేశ్, స్నేహలత, సీడీపీవో అలేఖ్య, సంధ్య, స్వర్ణలత, సుమతి, హెచ్‌ఎం జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన



ప్రతినిధిని సన్మానిస్తున్న సమ్మయ్య

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): గంగారం గ్రామ పంచాయతీ పరిధిలోని ఊశన్నపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను లక్నో బృందం శుక్రవారం సందర్శించింది. బృందంలోని దేవి సంస్థాన్ పెడ గాజీ విభాగానికి చెందిన సభ్యులు సయ్యద్ మహ్మద్ సలీం, ప్రవీణ్ యాదవ్ విద్యార్థులతో మాట్లాడారు. ఎఫ్‌ఎల్‌ఎన్ అమలు తీరుపై ఆరా తీశారు. భాషాభివృద్ధి, గణిత ప్రక్రియలను పరీక్షించారు. మారుమూల గ్రామాల్లోనూ విద్యార్థులు ఇంగ్లిష్‌లో చక్కగా మాట్లాడటం ప్రశంసనీయమన్నారు. హెచ్‌ఎం ఈర్ల సమ్మయ్య, ఉపాధ్యాయులు అమృతసురేశ్, బండారి స్రవంతితోపాటు జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి పీఎం షేక్, డీఆర్పీ సంది సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

మంగపేటవాసికి పురస్కారం



శ్రీనివాస్‌ను అభినందిస్తున్న సురేశ్, టీచర్లు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మంగపేటకు చెందిన ఒల్లాల శ్రీనివాస్ 2024కుగాను డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. ఆంగ్లభాషపై ఆసక్తి పెంపొందించేలా 20 పరిశోధన పత్రాలు సమర్పించిన శ్రీనివాస్‌కు పాండిచ్చేరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(పీఐఎంఎస్) ఈ పురస్కారం అందజేసింది. వివిధ అంశాల్లో పరిశోధనలు చేసినందుకు ఆ సంస్థ ఏటా ఈ అవార్డులు అందిస్తోంది. శ్రీనివాస్ సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి మైనారిటీ గురుకుల పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయనను గురుకులాల సమన్వయకర్త ఆర్‌ఎల్‌సీ సురేశ్, ప్రిన్సిపాల్ మహేశ్, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

దరఖాస్తులు ఆహ్వానం

జ్యోతినగర్(రామగుండం): మైనార్టీ విద్యార్థులకు ఉచిత వృత్తి శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి రంగారెడ్డి తెలిపారు. అర్హత గల ఇంజినీరింగ్ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అకౌంట్స్ అసిస్టెంట్ యూజింగ్ ట్యాలీ, ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రంగారెడ్డి పేర్కొన్నారు. ఆసక్తిగల ధ్రువీకరణ పత్రాలను జతచేసి ఈనెల 27వ తేదీలోగా పెద్దపల్లిలోని తమ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

పోటెత్తిన సన్నాలు

- బోనస్ వర్తింపజేయడమే ప్రధాన కారణం
- తుది దశకు చేరుకున్న ధాన్యం కొనుగోళ్లు
- మొత్తం 2.66 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు సేకరణ
- అన్నదాతల బ్యాంకు ఖాతాల్లో రూ.63.51 కోట్ల బోనస్ జమ
- జిల్లావ్యాప్తంగా 18,962 మంది రైతులకు చెల్లింపులు



పెద్దపల్లి శివారులోని ధాన్యం కొనుగోలు కేంద్రం

సాక్షి, పెద్దపల్లి: ఏటా అన్నదాతల నిరసనలు, ధర్నాలు, రాస్తారోకోల మధ్య ధాన్యం సేకరణ సాగేది. ఈ వానాకాలంలో అలాంటి అవరోధాలకు తావులేకుండా కొనుగోళ్లు సాఫీగా సాగాయి. సన్నవడ్లు క్వింటాలుకు ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించటం, అధికార యంత్రాంగం నిరంతరం పర్యవేక్షించడం, తరుగు పేరిట కోతలు లేకపోవడం ఇందుకు ప్రధాన కారణమని అధికారులు వివరిస్తున్నారు. దసరా పండుగ అనంతరం వరి కోతలు ప్రారంభం కాగా.. దీపావళి పండుగ నాటికి జోరందుకున్నాయి. మధ్యలో కొన్నిసార్లు అకాల వర్షాలతో రైతులు కొన్ని ఇబ్బందులు పడ్డారు. అయితే, ధాన్యంలో కోతలకు తావులేకుండా చర్యలు తీసుకోవడంతో రెండుమూడ్రోజుల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమవుతున్నాయి. మరోవారం పదిరోజుల్లో కొనుగోళ్ల ప్రక్రియ పూర్తవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. పలువురు వ్యాపారులు కల్లాల వద్ద ధాన్యం కొనుగోలు చేసినా.. సన్నాలకు బోనస్ వర్తిస్తుండడంతో కొనుగోలు కేంద్రాలకే రికార్డుస్థాయిలో సన్నవడ్లు వచ్చి చేరుతున్నాయి.

రూ.63 కోట్ల బోనస్ జమ..

గతేడాది వానాకాలం సీజన్‌లో మొత్తం 1.88 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, ఈ ఏడాది ఈ సీజన్‌లో 321 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచే చేసి 47,209 మంది రైతుల నుంచి ఇప్పటివరకు రూ.617 కోట్ల విలువైన 2.66లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. మంథని పరిధిలో ఇంకా 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో 29,809 మంది రైతుల నుంచి రూ.94.55 కోట్ల విలువైన సన్నరకం ధాన్యం సేకరించగా, అందులో 18,962 మంది రైతులకు రూ.63.51 కోట్ల బోనస్ చెల్లించారు. మరో 1,0847 మంది రైతుల ఖాతాల్లో రూ.31.04 కోట్లు జమ చేయాల్సి ఉంది.

వేగవంతంగా వివరాల నమోదు

గతంలో తరుగు పేరిట రైస్‌మిల్లుల్లో ట్రక్‌షీట్లు ఇవ్వడంలో జాప్యమైంది. దీంతో ట్యాబ్‌లలో వివరాలు నమోదు చేయడం ఆలస్యమయ్యేది. దీంతో రైతుల బ్యాంకు ఖాతాల్లో వారం, పదిరోజులు గడిస్తేనే.. డబ్బు జమయ్యేది. ఈసారి కోతలు లేవు, రైస్ మిల్లర్లు లారీల్లోంచి ధాన్యం వెనువెంటనే అన్‌లోడ్ చేసుకోవడం, ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు సివిల్ సప్లయ్ పోర్టల్‌లో ట్యాబ్‌లతో నమోదు చేయడంతో కొనుగోళ్ల ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన సమాచారాన్ని పరిశీలించి, జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ ప్రభుత్వానికి విక్రయించిన ధాన్యానికి డబ్బులు చెల్లించాలని నివేదికలు పంపిస్తున్నారు. దీంతో రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ నుంచి నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు సన్న, దొడ్డురకం వడ్లు కలుపుకొని 44,225 మంది రైతులకు రూ.581.55కోట్ల మేరకు వారి బ్యాంకు ఖాతాల్లో జమచేశారు.

జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల సమాచారం

ఏర్పాటు చేసిన కేంద్రాలు	321
మూసివేసినవి	106
ధాన్యం విక్రయించిన రైతులు	47,209
కొనుగోలు చేసిన ధాన్యం (మెట్రిక్ టన్నుల్లో)	2,66,280
ధాన్యం విలువ(రూ.కోట్లలో)	617.72
కొనుగోలు చేసిన దొడ్డురకం (మెట్రిక్ టన్నుల్లో)	63,267.75
కొనుగోలు చేసిన సన్నరకం (మెట్రిక్ టన్నులు)	2,03,012.80

తుదిశకు కొనుగోళ్లు



"జిల్లాలో వానాకాలం ధాన్యం కొనుగోళ్లు తుదిదశకు చేరాయి. వచ్చిన వడ్లను వచ్చినట్లే తూకం వేయడంతో కొనుగోళ్లు వేగంగా సాగుతున్నాయి. ట్యాబ్‌లో వివరాలు నమోదు చేశాక రెండు రోజుల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమచేస్తున్నాం. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెనువెంటనే రైస్‌మిల్లుల్లోకి తరలిస్తున్నాం. రైతులు ఇబ్బంది పడకుండా ప్రభుత్వ ఆదేశానుసారం ప్రతీ ధాన్యపు గింజను పకడ్బందీగా కొనుగోలు చేస్తున్నాం.

– శ్రీకాంత్, జిల్లా పౌర సరఫరాల మేనేజర్

ఉత్తమ రైతు మల్లారెడ్డి

- డ్రమ్‌సీడర్ ద్వారా వరి సాగులో ఆదర్శం



మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు నుంచి అవార్డు అందుకుంటున్న రైతు మల్లారెడ్డి

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): పెద్దపల్లి మండలం కాసులపల్లి గ్రామానికి చెందిన ఎర్రం మల్లారెడ్డి ఉత్తమ రైతు అవార్డు అందుకున్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లో శుక్రవారం డైమండ్ జూబ్లీ వేడుకలు నిర్వహించింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు నుంచి మల్లారెడ్డి ఉత్తమ రైతు అవార్డు అందుకున్నారు. 2012 నుంచి మల్లారెడ్డి డ్రమ్‌సీడర్ ద్వారా వరి సాగు చేస్తున్నారు.

నూతన వంగడాలతో ప్రోత్సహిస్తూ..

తన అనుభవాలు, సాగు పద్ధతుల గురించి స్థానికులతోపాటు పొరుగున ఉన్న కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు తదితర రాష్ట్రాల రైతులకు అవగాహన కల్పించడంతోపాటు తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని ఆరు పరిశోధన కేంద్రాల నుంచి వివిధ రకాలైన వరి విత్తనాలు తీసుకొచ్చి సాగు చేసి అభివృద్ధి చేస్తున్నారు మల్లారెడ్డి. చీడపీడలను తట్టుకునే వరి వంగడాలను రైతులకు అందిస్తూ అధిక దిగుబడి సాధించేలా ప్రోత్సహిస్తున్నారు. నువ్వు, ఆకు కూరలు, బంతిపూలు, కూరగాయలూ సాగుచేస్తూ అధిక ఆదాయం గడిస్తున్నారు. పెద్దపల్లి జిల్లా ఫార్మర్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ చైర్మన్‌గానూ ఆయన బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇందులో సుమారు 300 మంది రైతులను భాగస్వాములను చేశారు. అధిగబడి ఇచ్చే కూరగాయల విత్తనాలు, వరి వంగడాలను రాయితీపై అన్నదాతలకు అందజేస్తున్నారు. రైతు మల్లారెడ్డి సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఆయనను ఉత్తమ రైతు పురస్కారంతో సత్కరించింది. రైతులు, గ్రామస్తులు తదితరులు ఆయనను అభినందించారు. అవార్డుకు నామినేటు చేసిన కూనారం వ్యవసాయ పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ సిద్ధి శ్రీధర్, ప్రభుత్వానికి మల్లారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రాక్టికల్స్‌కు నిధులు విడుదల

సుల్తానాబాద్(పెద్దపల్లి): జిల్లాలో ఇంటర్మీడియెట్ ప్రయోగ పరీక్షల నిర్వహణకు అవసరమైన నిధులను ప్రభుత్వం ఇటీవల విడుదల చేసింది. ఒక్కో జూనియర్ కళాశాలకు రూ.25 వేలు కేటాయించింది. వీటిని ల్యాబ్‌ల నిర్వహణ, రసాయనాల కొనుగోలుకు వెచ్చిస్తారు. జిల్లాలో మొత్తం 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వచ్చే ఏడాది ఇంటర్ వార్షిక పరీక్షలు నిర్వహిస్తారు.

ఏసుక్రీస్తు బోధనలు అనుసరించాలి



కేక్ కట్ చేస్తున్న క్రైస్తవులు

మంథని: ఏసుక్రీస్తు బోధనలు క్రైస్తవులు అందరూ అనుసరించాలని ఇంటర్నేషనల్ మిషన్స్ ఇండియా ప్రధాన కార్యదర్శి అంకరి కుమార్ అన్నారు. పట్టణ శివారులోని శ్రీరాంనగర్ సియోను ప్రార్థన మందిరంలో శుక్రవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత కేట్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడారు. పొరుగువారిని ప్రేమించడం, ఆప్యాయత పంచడం లాంటి క్రీస్తు బోధనలు అనుసరించాలని కోరారు. ఆజ్మీరా దయారాజ్, దూడ మహేశ్, మంథని మార్క్, గద్దల రాజేశ్, జోసెఫ్, మంథని ప్రసాద్, చింతకుంట్ల ప్రేమ్‌కుమార్, అందె రమేశ్, ఈర్ల సదానందం, రామగిరి కుమార్, కామని మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల పనితీరు మెరుగుపడాలి



ఆస్పత్రి భవనం పరిశీలించి అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని మహిళా సంఘాల పనితీరు మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. కలెక్టరేట్‌లో స్వశక్తి మహిళా సంఘాలతో శుక్రవారం నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి 9,102 మహిళా సంఘాలకు సుమారు రూ.478 కోట్ల రుణాలు మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్దేశించగా.. ఇప్పటివరకు 3,898 సంఘాలకు రూ.322.68 కోట్లు మంజూరు చేశారని కలెక్టర్ తెలిపారు. లక్ష్యంలో 67.51 శాతమే సాధించామని, ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశిత లక్ష్యం సాధించాలని ఆయన సూచించారు. ఎన్‌పీఏలను తగ్గించాలని అన్నారు. స్త్రీనిధి రుణాల రికవరీపై దృష్టి సారించాలని తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్, అడిషనల్ డీఆర్‌డీవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

మంథని, సుల్తానాబాద్ బల్దియాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృషి సారించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. ఉద్యోగులు, సిబ్బంది వేతనాల చెల్లింపుల్లో ఆలస్యం నివారించా లని అన్నారు. అభివృద్ధి పనులను ప్రాధాన్యతాక్రమంలో మార్చి వరకు పూర్తి చేయాలని పేర్కొన్నారు. రోడ్ల విస్తరణ, అభివృద్ధి పనులకు ఆటంకంగా ఉన్న విద్యుత్ స్తంభాలను ట్రాన్స్‌కో అధికారులతో సమన్వయం చేసుకుంటూ తొలగించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. ఆస్తిపన్ను, ట్రేడ్ లైసెన్స్ వసూలు చేయాలని తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్ పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని అన్నారు. సుల్తానాబాద్‌లోని డివైడర్లలో మొక్కలు పెంచాలని పేర్కొన్నారు. డంప్ యార్డ్‌కు అనుకూలమైన స్థలం ఎంపిక చేయాలని ఆదేశించారు. సుల్తానాబాద్ మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వెంకటేశ్, మంథని కమిషనర్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

42 పడకలను అందుబాటులోకి తేవాలి

సుల్తానాబాద్(పెద్దపల్లిరూరల్): జిల్లా కేంద్రంలో చేపట్టిన 42 పడకల ప్రభుత్వ ఆస్పత్రి భవనాన్ని త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో చేపట్టిన 42 పడకల భవనాన్ని ఆయన తనిఖీ చేశారు. 2025 జనవరిలోగా పనులను నాణ్యతో పూర్తిచేయాలని సూచించారు. టీఎస్‌ఎంఐడీసీ ఈఈ రవీందర్, అధికారులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ మొక్కలు నాటాలి

వచ్చే ఏడాది జనవరిలోగా 850 ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటే ప్రక్రియ పూర్తిచేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. ఆయిల్ పామ్ మొక్కల గ్రౌండింగ్‌పై ఆయన సమీక్షించారు. అధికారులు జగన్మోహన్‌రెడ్డి, ఆదిరెడ్డి, తిరుమల ఆయిల్‌పామ్ కంపెనీ సీఈవో కేశు కల్యాణ్‌కర్ తదితరులు పాల్గొన్నారు.

పనితీరు ఆధారంగా పోలీస్‌లకు గ్రేడింగ్

- రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ వెల్లడి

గోదావరిఖని: నేరాల నియంత్రణకు మెరుగైన ప్రొయాక్టివ్ పోలీసింగ్ నిర్వహించాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. కమిషరేట్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్ల అధికారులతో కమిషనరేట్ నుంచి శుక్రవారం ఆన్‌లైన్ జూమ్ మీటింగ్‌లో వార్షిక నేర సమీక్ష నిర్వహించారు. డీసీపీ, ఏసీపీ, సీఐ స్థాయి అధికారులు సమీక్షించి ప్రతీ కేసును త్వరగా పరిష్కరించాలని సీపీ సూచించారు. విచారణలోని కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన విచారణ పూర్తిచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని పేర్కొన్నారు. నేరాల నియంత్రణకు విజుబుల్ పోలీసింగ్, నిరంతర పెట్రోలింగ్‌తోపాటు, ఆకస్మిక వాహన తనిఖీలు చేయాలని, సాంకేతిక వ్యవస్థ కూడా వినియోగించుకోవాలని అన్నారు. అధికారులు పనితీరు ఆధారంగా వచ్చే ఏడాది నుంచి గ్రేడింగ్ ఇస్తామని ఆయన తెలిపారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే రౌడీలు, అసాంఘిక శక్తులు, మావోయిస్టులపై దృష్టి కేంద్రీకరించాలని, డయల్ 100కు వచ్చే కాల్స్‌పై తొందరగా స్పందించాలని చెప్పారు. గంజాయి, పేకాట, పీడీఎస్ రైస్, గుడుంబా, వైట్ కాలర్ తదితర నేరాలు, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని అన్నారు. భూతగాదాలు, సివిల్ కేసుల్లో ఎస్‌వోపీ ప్రకారం పారదర్శకంగా విచారణ చేపట్టాలన్నారు. పెద్దపల్లి డీసీపీ చేతన, అడిషనల్ డీసీపీ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో లాఠీ రాజ్యం నడుస్తోంది

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అధ్యక్షుడు చందర్

గోదావరిఖని: రాష్ట్రంలో లాఠీరాజ్యం నడుస్తోందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ విమర్శించారు. స్థానిక ప్రధాన చౌరస్తా సమీపంలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో శుక్రవారం ఆయన రిలే నిరాహార దీక్ష ప్రారంభించి మాట్లాడారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అక్రమ కేసులు నమోదు చేస్తూ రేవంత్‌రెడ్డి సర్కార్ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. అక్రమ కేసులు ఎత్తివేయాలని, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నేరవేర్చాలని డిమాండ్ చేశారు. ఉద్యమాల గడ్డ రామగుండం నుంచి రేవంత్‌రెడ్డి పాలన పతనం ప్రారంభమైందని ఆయన అన్నారు. కేటీఆర్‌పై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేసేదాకా బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు సాగుతాయని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మూల విజయారెడ్డి, గోపు అయిలయ్యయాదవ్, కార్పొరేటర్లు గాదం విజయ, బాదె అంజలి, జనగామ కవితాసరోజిని, నారాయణదాసు మారుతి, అచ్చే వేణు, బొడ్డు రవీందర్, మేతుకు దేవరాజ్, రాకం వేణు, జిట్టవేన ప్రశాంత్, ముద్దసాని సంధ్యారెడ్డి పాల్గొన్నారు.

ఒక్కరోజైనా ఆడలే..



- ఇది రామగిరి మండలం గ్రామం తెలంగాణ క్రీడా ప్రాంగణం. గత ప్రభుత్వం దీనిని ఏర్పాటుచేసింది. ప్రస్తుతం దీనిపై పర్యవేక్షణ కరువైంది. దీంతో బోర్డు తొలగించి పక్కన పడేశారు.



- ఇది రామగిరి మండలం కల్వచర్లలోని గ్రామీణ క్రీడా ప్రాంగణం. దీని నిర్వహణను ఎవరూ పట్టించుకోవడంలేదు. స్థానికులు తమ వాహనాల పార్కింగ్ కోసం ఇలా వినియోగిస్తున్నారు.



ఇది రామగిరి మండలం పన్నూర్ గ్రామంలోని క్రీడా ప్రాంగణం. సంబంధిత శాఖ అధికారులు నిర్వహణ విస్మరించడంతో క్రీడా మైదానంలో పిచ్చిమొక్కలు ఇలా ఏపుగా పెరిగాయి. గ్రామీణ క్రీడాకారులకు ఆటంగా మారాయి.

- మైదానం ఉంది.. ఆటల్లేవ్
- పిచ్చిమొక్కలు.. కరువైన వసతులు
- అందుబాటులోకి రాని క్రీడా పరికరాలు
- అధికారుల పర్యవేక్షణ లోపం.. క్రీడాకారులకు శాపం
- జిల్లాలో గ్రామీణ క్రీడా ప్రాంగణాల దుస్థితి

రామగిరి(మంథని): గ్రామీణ యువత, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు, క్రీడా నైపుణ్యం వెలికితీసేందుకు గత ప్రభుత్వం ఊరూరా తెలంగాణ క్రీడా మైదానాలు ఏర్పాటు చేసింది. స్థలం కొరతతో కొన్ని గ్రామాల్లో క్రీడామైదానాలు ఏర్పాటు చేయనేలేదు. అయితే, కొన్నిచోట్ల పాఠశాలల మైదానాల్లో బోర్డులు ఏర్పాటు చేసి మమ అనిపించారు. కొన్ని పల్లెల్లో ఏర్పాటు చేసినా వాటి నిర్వహణ విస్మరించారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కూడా కరువైంది. దీంతో అవి బోర్డులకే పరిమితమయ్యాయి. నిర్వహణ లేక పిచ్చిమొక్కలు, గడ్డి ఏపుగా పెరిగింది. కొన్నిచోట్ల పరికరాలు తుప్పుపట్టి ఎందుకూ పనికిరాకుండాపోయాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక క్రీడాపాలసీ తీసుకొస్తోంది. ఈ నేపథ్యంలో వీటిపై దృష్టి సారించాలని క్రీడాకారులు, క్రీడాభిమానులు కోరుతున్నారు.

ఉపాధిహామీ నిధులతో..

జిల్లాలో 266 గ్రామ పంచాయలు ఉండగా.. ఉపాధిహామీ ద్వారా విడుదలైన నిధులతో 230 క్రీడా ప్రాంగాణాలు ఏర్పాటు చేశారు. ఒక్కోదానికి దాదాపు రూ.లక్ష నుంచి సుమారు రూ.2లక్షల వరకు వెచ్చించి ఏర్పాట్లు చేశారు. ఎకరం స్థలంలో మైదానం ఏర్పాటు చేయాలని, అందులో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, లాంగ్‌జంప్ పిట్‌లతో పాటు వ్యాయామ పరికరాలు అందుబాటులో ఉంచాలని అప్పటి ప్రభుత్వం సూచించింది. వీటితోపాటు చుట్టూ ఫెన్సింగ్ మాదిరిగా కానుగ, వెదురు, తంగేడు తదితర మొక్కలు విరివిగా నాటి పెంచాలని ఆదేశించింది. అయితే, అధికారుల నిర్లక్ష్యంతో ఈ సౌకర్యాలు ఎక్కడా కార్యరూపం దాల్చలేదు. నామమాత్రంగా ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగాణాలు చెట్లు, పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేక తెలంగాణ క్రీడా మైదానాలకు కేటాయించిన రూ.లక్షలు వృథా అయ్యాయనే విమర్శలు కొంతకాలంగా వెలువెత్తుతున్నాయి. కొన్నిచోట్ల పెద్దబోర్డులు ఏర్పాటు చేయడం తప్ప క్రీడా సామగ్రి, పరికరాలు, వసతులు కల్పించలేదన్న వాదనలూ వినిపిస్తున్నాయి.

జాడలేని క్రీడా సామగ్రి?

గత ప్రభుత్వం క్రీడా ప్రాంగాణాలు ఏర్పాటు చేయడంతోపాటు ఒక్కో గ్రామ పంచాయతీకి సుమారు రూ.లక్షకుపైగా విలువైన క్రీడా సామగ్రిని కేటాయించింది. వీటిని గ్రామప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులకు అందజేసింది. క్రీడా ప్రాంగాణాలు వినియోగంలోకి రాకపోవడంతో అవి ఎక్కడ ఉన్నాయనేది ఎవరికీ తెలియడంలేదు.

లక్ష్యం నెరవేరేదెలా?



గ్రామీణ యువతను క్రీడల్లో తీర్చిదిద్దేందుకు గత ప్రభుత్వం తెలంగాణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. వారు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించేలా క్రీడాసామగ్రి అందజేసింది. కానీ, వసతుల లేమి, పర్యవేక్షణ లోపంతో ఇప్పటివరకు అందులో ఒక్క ఆటైనా ఆడిన సందర్భం లేదు.

– బూరుగు రాజుగౌడ్, క్రీడాకారుడు, రామగిరి

వినియోగంలోకి తెస్తాం



గ్రామీణ క్రీడా ప్రాంగాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. వినియోగంలో లేనివాటిని గుర్తించి, క్రీడా పరికరాలను వినియోగంలోకి తీసుకొస్తాం. క్రీడా ప్రాంగాణాలను, క్రీడా పరికరాలను యువత సద్వినియోగం చేసుకుని పోటీల్లో రాణించేలా ప్రోత్సహిస్తాం.

– వీరబుచ్చయ్య, జిల్లా పంచాయతీ అధికారి

క్లుప్తంగా

నేరెల్ల గుట్టల్లో మృతదేహం?

ధర్మపురి: మండలంలోని నేరెల్ల గుట్టల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అడవిలో పనులకు వెళ్లిన కొందరు సదరు మృతదేహాన్ని చూసినట్లు తెలిసింది. దీనిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ విషయమై ఎస్సై ఉదయ్‌కుమార్‌ను వివరణ కోరగా అడవిలో మృతదేహం ఉన్నట్లు వదంతులు వస్తున్న మాట నిజమేనని, కానీ ఎక్కడుందో తెలియడం లేదని పేర్కొన్నారు. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, గాలింపు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య


రమేశ్ మృతదేహం

హుజూరాబాద్: మండలంలోని రాంపూర్‌కు చెందిన సుంకరి రమేశ్(46) ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. రమేశ్‌కు భార్య, ఇద్దరు పిల్ల లున్నారు. దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండటంతో రెండేళ్ల క్రితం పిల్లలను తీసుకొని, భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటినుంచి రమేశ్ ఏ పనీ చేయకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో అతనికి కేన్సర్ ఉన్నట్లు తెలిసింది. పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టి, భార్యను ఇంటికి రావాలని కోరినా ఆమె రాలేదు. దీంతో రమేశ్ మనస్తాపానికి గురై, శుక్రవారం ఇంట్లోనే ఉరేసుకున్నాడు. మృతుడి తల్లి కొమురమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

కుక్కల దాడిలో గొర్రెపిల్లలు మృత్యువాత


చనిపోయిన గొర్రెపిల్లలు

ధర్మారం(ధర్మపురి): నర్సింగపూర్ గ్రామానికి చెందిన బద్ద సుధాకర్‌రెడ్డి గొర్రెల మందపై శుక్రవారం ఉదయం కుక్కలు దాడిచేశాయి. ఈ ఘటనలో 12 గొర్రెపిల్లలు చనిపోయాయి. తన ఇంటి వెనుకాల షెడ్‌లో గొర్రెలను ఉంచగా, వీధికుక్కలు ఒక్కసారిగా దాడిచేసి చంపినట్లు బాధితుడు సుధాకర్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన తర్వత గొర్రె పిల్లలకు పాలు పెట్టేందుకు వెళ్లగా గొర్రెపిల్లలు కనిపించలేదని, సమీపంలో గాలించగా కళేబరాలు కనిపించాయని ఆవేదన వ్యక్తం చేశాడు. గొర్రె పిల్లల కోసం వేసిన ఫెన్సింగ్‌ను ధ్వంసం చేసి గొర్రె పిల్లలను ఎత్తుకుపోయి చంపినట్లు అతడు వివరించాడు.

పీఏసీఎస్ సేవలు విస్తరించాలి


మాట్లాడుతున్న నాబార్డ్ సీజీఎం ఉదయభాస్కర్

సుల్తానాబాద్(పెద్దపల్లి): పీఏసీఎస్ సేవలు విస్తరించాలని నాబార్డ్ సీజీఎం ఉదయభాస్కర్ అన్నారు. శుక్రవారం సుల్తానాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. సహకార సంఘం సభ్యులకు 6 శాతం డివిడెంట్ ఇవ్వడం శుభపరిణామమని అన్నారు. వ్యాపారులకు, గృహ నిర్మాణదారులకు రుణాలు ఇవ్వడంతోపాటు లాకర్ సౌకర్యం ఏర్పాటు చేస్తే మరిన్ని లాభాలు వస్తాయని తెలిపారు. రైతులకు ఎక్కువ రుణాలు ఇచ్చే ప్రయత్నం చేయాలని సూచించారు. చైర్మన్, కేడీసీసీబీ డైరెక్టర్ శ్రీగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. పీఏసీఎస్ పరిధిలో 3,499 మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. రూ.40 కోట్ల విలువైన రుణాలు ఇచ్చామని, రూ.19 కోట్ల డిపాజిట్లు ఉన్నాయన్నారు. అనంతరం నాబార్డ్ సీజీఎంను సన్మానించారు. కార్యక్రమంలో కేడీసీసీబీ సీఈవో సత్యనారాయణరావు, డీడీఎంలు జయప్రకాశ్, దిలీప్, జీఎం రియాజుద్దీన్, రిసోర్స్‌పర్సన్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతు చేయరు.. పూడిక తీయరు

- ఎస్సారెస్పీ కాల్వల నిర్వహణ అధ్వానం
- చివరి ఆయకట్టుకు నీరందక ఎండుతున్న పంటలు

ఇది డీ–89 ప్రధాన కాల్వ దుస్థితి. కరీంనగర్ మండలం ఎలబోతారం శివారులో కాల్వ సిమెంట్ లైనింగ్ కూలిపోగా, అడ్డుగా పడిన బండరాళ్లతో కిందకు నీళ్లు వెళ్లలేని స్థితి. కరీంనగర్ జిల్లాలోని చాలావరకు కాల్వలది ఇదే పరిస్థితి.




పెద్దపాపయ్యపల్లి మీదుగా వెళ్లే ఉప కాలువలో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు

కరీంనగర్‌రూరల్/హుజూరాబాద్: ఎస్సారెస్పీ కాల్వలు అధ్వానంగా మారాయి. ఆయకట్టు కాల్వలు శిథిలావస్థకు చేరాయి. డ్రాపులు కూలిపోయి పొలాలకు నీళ్లందడం లేదు. ప్రధాన కాల్వలకు మరమ్మతు చేయకపోవడం, పూడిక తీయకపోవడంతో ఏటా ఆయకట్టు చివరి భూములకు నీరందక పంటలు ఎండిపోతున్నాయి. ప్రస్తుతం యాసంగి సీజన్ పంటల సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నెల 25 నుంచి ఎస్సారెస్పీ నీటిని విడుదల చేస్తారనే ప్రభుత్వ ప్రకటనతో పలువురు రైతులు వరిపంటను సాగు చేసేందుకు ముందుకొస్తున్నారు.

పేరుకుపోయిన పూడిక

కరీంనగర్‌రూరల్ డివిజన్ పరిధిలో డీ–89 నుంచి డీ–94 ప్రధాన కాల్వల ద్వారా 27వేల ఎకరాలు సాగవుతోంది. డీ–89 ప్రధాన కాల్వ శిథిలావస్థకు చేరింది. డ్రాపులు కూలిపోగా సిమెంట్ లైనింగ్ ధ్వంసమైంది. కాల్వల్లో బండరాళ్లు అడ్డుగా పడడంతో ఆయకట్టు కింది గ్రామాలు ఇరుకుల్ల, మొగ్దుంపూర్, సాంబయ్యపల్లి, గొల్లపల్లి గ్రామాల్లోని ఆయకట్టు భూములకు నీళ్లందడం లేదు. ప్రధాన కాలవ్తోపాటు ఉపకాలువల్లో సైతం పిచ్చిమొక్కలతో పూడిక పేరుకుపోయింది. డీ–94 ప్రధాన కాల్వ ద్వారా గోపాల్‌పూర్, దుర్శేడ్, బొమ్మకల్, చేగుర్తి గ్రామాలకు సాగునీరు సరఫరా చేస్తారు. అయితే కార్పొరేషన్‌లో విలీనమైన రేకుర్తి, ఆరెపల్లి, తీగలగుట్టపల్లి, వల్లంపహాడ్ పరిధిలోని కాలువలో పిచ్చిమొక్కలు పెరిగి పూడిక పేరుకుపోయింది. ఆయా గ్రామాల్లో ఉపాధిహామీలో పూడికతీసే అవకాశం లేకపోవడంతో ఇటీవల మున్సిపల్ నిధులు రూ.6 లక్షలతో పూడిక తొలగించే పని చేపట్టారు.


ఇరుకుల్ల శివారులో కాలువ గట్టుకు పడిన గండి


మొగ్ధుంపూర్‌లో కూలిన డ్రాపు

250 ఎకరాలకు నీరందించే కాలువపై అలసత్వం..

ఎస్సీరెస్పీ కెనాల్ కింద గల డీబీఎం–17 ఉప కాలువ పరిధిలో పెద్ద పాపయ్యపల్లి, హుజూరాబాద్, రాంపూర్, రంగాపూర్ గ్రామాల్లో సుమారు 250 ఎకరాలకు నీరందించే లక్ష్యంగా ఏర్పాటైంది. పెద్దపాపయ్యపల్లి నుంచి ప్రారంభమై హుజూరాబాద్ పోచమ్మగుండ్ల కింది వరకు వెళ్లి వాగులో కలుస్తుంది. ఉపకాల్వ కింద ఆయకట్టు రైతులు ఏడాదికి రెండు పంటలు పండించవచ్చు. ఆయకట్టు రైతులే లక్ష్యంగా ఉన్న ఈ కాలువపై అధికారుల పట్టింపు కరువవడంతో పూర్తిగా రూపురేఖలు కోల్పోయింది.

పూర్వ వైభవం తీసుకురావాలి



ఆయకట్టు రైతుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని అధికారులు డీబీఎం–17 ఉపకాలువకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి. పేరుకుపోయిన పూడిక, పిచ్చిమొక్కలను తొలగించాలి. కాలువ సరిగ్గా లేకపోతే చివరి ఆయకట్టు వరకు నీరందే పరిస్థితి లేదు. అధికారులు చొరవ తీసుకొని మరమ్మతులు చేయించి కాలువకు పూర్వవైభవం తీసుకురావాలి.

– పసుల స్వామి, సామాజిక కార్యకర్త, హుజూరాబాద్

అత్యవసర పనులకే నిధులు మంజూరు

ఎస్సారెస్పీలో అత్యవసరమైన పనులకు మాత్రమే ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంది. ఇరుకుల్ల వద్ద రూ.4లక్షలతో కల్వర్టు పనులు నడుస్తున్నాయి. ఉపాధిహామీ ద్వారా కొన్ని కాలువల్లో పూడిక తొలగించాం.

– సంతోష్, డీఈ, ఎస్సారెస్పీ, కరీంనగర్‌రూరల్

కాలువ శిథిలం.. పారకం ప్రశ్నార్థకం


సుద్దాలలో ధ్వంసమైన డీ-86 మెయిన్ కెనాల్ తూము

పెద్దపల్లి జిల్లాలో యాసంగి సాగు ప్రారంభమైంది. ఇప్పటికే మొక్కజొన్న ఏపుగా పెరుగుతోంది. కొందరు రైతులు వరి నారుపోశారు. నాట్లు వేసేందుకు మరికొందరు పొలాలు సిద్ధం చేస్తున్నారు. ఈ పంటలకు సాగునీరు అందించాల్సిన ఎస్సారెస్పీ కాలువలు ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, చెట్లు, పూడికతో దర్శనమిస్తున్నాయి. చాలాచోట్ల ధ్వంసమై సాగునీటి పారకానికి అవరోధంగా మారాయి. సుల్తానాబాద్ పరిధిలోని దృశ్యాలివి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి


చెట్లు, ముళ్ల పొదలతో నిండిన కాలువ

భూకబ్జా కేసులో బీఆర్‌ఎస్ నాయకుల రిమాండ్

సిరిసిల్ల క్రైం: ప్రభుత్వ భూమిని అక్రమంగా పట్టా చేసుకున్న బీఆర్‌ఎస్ నాయకులను సిరిసిల్ల పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు అగ్గి రాములు, తంగళ్లపల్లి స్టేషన్ పరిధిలో జిందం దేవదాసుపై కేసు నమోదైంది. అధికారులను మచ్చిక చేసుకొని, అసైన్డ్ భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు వారిపై అభియోగాలున్నాయి. భూమి అనుభవదారుగా మార్చిన అప్పటి అధికారులపై కేసు నమోదు చేశామని, వారు పరారీలో ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

పింఛన్ ఇప్పిస్తానని నగలు కాజేశాడు..


రోదిస్తున్న చిన్న గంగు

కోరుట్ల: ఓ వృద్ధురాలికి పింఛన్ ఇప్పిస్తానని నమ్మించిన దుండగుడు ఆమె నగలు కాజేశాడు. బాధితురాలి వివరాల ప్రకారం.. కథలాపూర్ మండలం దుంపెటకు చెందిన దొప్పల చిన్న గంగు శుక్రవారం పని నిమిత్తం కోరుట్లకు వచ్చింది. స్థానిక నంది చౌరస్తా వద్ద ఉండగా ఆమె వద్దకు ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చి, నీకు పింఛన్ ఇప్పిస్తామని చెప్పాడు. మెడలో నగలు తీస్తే ఫొటో తీసుకుంటానన్నాడు. అతని మాటలు నమ్మిన చిన్న గంగు మెడలోని తులం బంగారు గొలుసుతోపాటు పావు తులం చెవికమ్మలు తీసి, ఇచ్చింది. వాటిని తీసుకున్న దుండగుడు వెంటనే అక్కడినుంచి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

అనారోగ్యంతో కళాకారుడి మృతి


బాబు (ఫైల్)

వీర్నపల్లి(సిరిసిల్ల): అడవిపదిరకు చెందిన మాట్ల బాబు (47) అనే కళాకారుడు అనారోగ్యంతో మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. బాబు తన కళాప్రదర్శనల ద్వారా ఎన్నో తెలంగాణ, బహుజన సాంస్కృతిక వేదికల మీద, ఎలక్షన్ క్యాంపెయిన్‌లలో ప్రదర్శనలు ఇచ్చాడు. ఓవైపు పేదరికం వెంటాడుతున్నా డప్పే తన ఆయుధంగా ప్రజల్లో చైతన్యానికి కృషి చేశాడు. ఆయన అనారోగ్యానికి గురై, పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నాడు. నయం కాకపోవడంతో గురువారం రాత్రి ఇంట్లోనే మృతిచెందాడు. మృతుడికి భార్య మంజుల, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు గజ్జెల ప్రశాంత్, స్థానికులు కోరారు.

మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ ఫోకస్

- రాజన్నసిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
- బైక్‌లు నడుపుతూ పట్టుబడిన దాదాపు 350 మందికి కౌన్సెలింగ్


మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్


హాజరైన మైనర్లు, తల్లిదండ్రులు

సిరిసిల్ల క్రైం: పిల్లలకు బైక్‌లు ఇచ్చి, షాప్‌కు వెళ్లమనడం, బంధువులను తీసుకురావాలని చెప్పడం, వెనకాల కూర్చొని, వారితో డ్రైవింగ్ చేయించడం ప్రమాదకరమని రాజన్నసిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లాలో మైనర్లు వాహనాలు నడుతూ ప్రమాదాలకు కారణమవుతున్నందున నాలుగు రోజులుగా మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ ఫోకస్ పెట్టినట్లు తెలిపారు. దీంతో ఊహించని స్థాయిలో దాదాపు 350 మంది మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలకు పెద్దలు కారణమని పలువురిని కౌన్సిలింగ్ చేసిన ప్పుడు తెలిసిందన్నారు. వారికి సిరిసిల్ల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించామని తెలిపారు. పిల్లలు డ్రైవింగ్ చేసి, ప్రమాదాలకు కారణమైతే కేసులపాలవుతారన్నారు. వారికి వాహనాలు ఇవ్వడం మానుకోవాలని సూచించారు. ప్రస్తుతం పట్టుబడినవారి వివరాలను వెంటనే ఆన్‌లైన్ చేయాలని, మళ్లీ బైక్‌లు నడుపుతూ పట్టుబడితే కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు. ఒకసారి ఎఫ్ఐఆర్ నమోదైతే ఉపాధి కోసం ఇతర దేశాలకు వెళ్లాలంటే పోలీసు క్లియరెన్స్ సర్టిఫికెట్ ఇవ్వడానికి ఉండదన్నారు. అందుకే నిర్ణీత వయస్సు వచ్చే వరకు వాహనాలు నడపొద్దని సూచించారు.

ఇకనుంచి ఇవ్వను



నేనే మా అబ్బాయిని బైక్ తీసుకెళ్లమని చెప్పాను. ప్రమాదాలు జరుగుతున్న తీరును పోలీసు సార్లు చెప్పిన తర్వాత ఇక బైక్ ఇవ్వొద్దని నిర్ణయించుకున్నాను. ఇప్పటినుంచి ఏదైనా పని ఉంటే నేనే వెళ్తాను.

– లింగపల్లి రాజేశం, సుందరయ్యనగర్, సిరిసిల్ల

సైకిల్‌పై వెళ్లమంటాం



డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా బండి నడపడం నేరమని ఇక్కడికి వచ్చినంక తెలిసింది. పిల్లలు అల్లరి చేస్తే వాహనం ఇచ్చాం. కానీ, ఇకనుంచి ఇవ్వము. పని ఉంటే సైకిల్, లేకుంటే నడిచి వెళ్లమని చెబుతాం.

– బిపాషా, సిరిసిల్ల

ఇంకోసారి బైక్ ఎక్కనివ్వను



మా ఊరిలో ఓ పెద్ద మనిషికి బైక్ అవసరం అంటే వాళ్ల ఇంటి నుంచి మావాడు తీసుకెళ్లి, పోలీసులు పట్టుబడ్డాడు. పిల్లలు వాహనాలు నడపడం ప్రమాదకరమని ఎస్పీ సారు చెప్పారు. ఇంకోసారి బైక్ ఎక్కనివ్వను.

– యానా రాజేశం, సిరిసిల్ల

ప్రజలు సహకరించాలి

వాహనాలు నడిపిన పిల్లలను పట్టుకుంటే తల్లిదండ్రులు విడిచిపెట్టాలని పైరవీలు చేయిస్తున్నారు. సంబంధిత పోలీసు అధికారులపై కోపగిస్తున్నారు. భవిష్యత్తు తరం ప్రమాదానికి గురికావొద్దనే మేము నాలుగు రోజులు తనిఖీలు చేశాం. మార్పు వస్తే అందరికీ మంచిది. ప్రజలు సహకరించాలి.

– అఖిల్ మహాజన్, ఎస్పీ

చోరీ కేసులో ఆరుగురి అరెస్టు

- పరారీలో మరొకరు
- ఆభరణాలు, రూ.10 వేలు, 6 ఫోన్లు, 2 డమ్మీ తుపాకులు, బైక్ స్వాధీనం



అరెస్టు చూపుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల క్రైం: ఓ ఇంట్లో చొరబడి, దంపతులను డమ్మీ తుపాకులతో బెదిరించి, దొంగతనం చేసిన కేసులో ఆరుగురిని అరెస్టు చేశామని, ఒకరు పరారీలో ఉన్నట్లు జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. శుక్రవారం జగిత్యాలలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన కాసం ఈశ్వరయ్య ఇంట్లో ఈ నెల 14 తెల్లవారుజామున దుండగులు చొరబడ్డారు. దంపతులను బంధించి, డమ్మీ తుపాకులతో బెదిరించి, 10 తులాల బంగారు ఆభరణాలు, రూ.10 వేలు చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజీ పరిశీలించారు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, రూరల్ సీఐ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నాలుగు పోలీసు బృందాలు నిందితుల కోసం గాలింపు చేపట్టాయి. సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి, నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలం మున్యాలకు చెందిన మున్నేశుల శ్రీనివాస్, మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మండలం గోపవాడకు చెందిన పొన్నూరు హైస్కూల్ రికార్డు అసిస్టెంట్ చిప్పబత్తుల తులసయ్య, జగిత్యాల రూరల్ మండలం గుట్రాజ్‌పల్లికి చెందిన బక్కెనపల్లి అరుణ్, బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన యశోద శ్రీనివాస్, జగిత్యాల రూరల్ మండలం అనంతారానికి చెందిన సైదు సహదేవ్, మంచిర్యాల జిల్లా జన్నారం మండలం మర్రిమడుగుకు చెందిన రత్నం మాణిక్యంలను శుక్రవారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 10 తులాల ఆభరణాలు, రూ.10 వేలు, 6 ఫోన్లు, ఒక ద్విచక్రవాహనం, రెండు డమ్మీ తుపాకులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మంచిర్యాల జిల్లా పోచమ్మవాడకు చెందిన ముకునూరి కిరణ్‌కుమార్ పరారీలో ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. డీఎస్పీ రఘుచందర్, రూరల్ సీఐ కృష్ణారెడ్డి, బీర్‌పూర్ ఎస్సై కుమారస్వామి, రూరల్ ఎస్సై సదాకర్, బుగ్గారం ఎస్సై శ్రీధర్‌రెడ్డి, సారంగాపూర్ ఎస్సై దత్తాద్రి, హెడ్‌కానిస్టేబుల్ గంగాధర్, కానిస్టేబుళ్లు గంగాధర్, శ్రీనివాస్, వెంకటేశ్, ముత్తయ్య, సుమన్, రవి, రమేశ్‌నాయక్, లింగారెడ్డి, శివ, పరమేశ్, జలంధర్‌లకు రివార్డులిచ్చి, అభినందించారు.

ఆడుకుంటూ వెళ్లి.. తప్పిపోయిన పాప

- తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు


పాపను కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న సీఐ వీరప్రసాద్

వేములవాడ: ఆడుకుంటూ రోడ్డుపైకి వచ్చి, తప్పిపోయిన ఓ పాపను కుటుంబసభ్యులకు అప్పగించినట్లు వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కొడిమ్యాలకు చెందిన రమేశ్–రమ్య దంపతులు వేములవాడలోని తమ బంధువుల ఇంట్లో పెళ్లి ఉంటే ఈ నెల 19న పాపను తీసుకొని, వెళ్లారు. రాత్రి బంధువుల ఇంట్లోనే ఉన్నారు. శుక్రవారం వేకువజామున వివాహానికి హాజరయ్యేందుకు ఫంక్షన్‌హాల్‌కు చేరుకున్నారు. ఆ సమయంలో పాప ఆడుకుంటూ రోడ్డుపైకి వచ్చింది. అలాగే చాలా దూరం వెళ్లింది. కాసేపటికి చిన్నారి కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికారు. ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. ప్రభు అనే యువకుడు తప్పిపోయి, ఏడ్చుకుంటూ వెళ్తున్న పాపను ఎత్తుకొని, స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. పోలీసులు ఆ చిన్నారి తల్లిదండ్రులను పిలిపించి, అప్పగించారు. పాపను జాగ్రత్తగా ఠాణాకు తీసుకొచ్చిన ప్రభును సీఐ వీరప్రసాద్ అభినందించారు. రమేశ్–రమ్య దంపతులు అతనితోపాటు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎములాడ రాజన్నకు మొక్కులు


ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు లక్ష్మీనారాయణకు ప్రసాదం ఇస్తున్న ఏఈవో

వేములవాడ: ఎములాడ రాజన్నను శుక్రవారం దాదాపు 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. స్వామివారికి అభిషేకాలు, అన్నపూజలు చేసి, కోడెమొక్కులు చెల్లించుకున్నారు. సత్యనారాయణ వ్రతాలు, అమ్మవారికి కుంకుమ పూజలు జరిపారు. అనంతరం బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించి, భీమన్న, నగరేశ్వరాలయాలను సందర్శించారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

స్వామివారి సేవలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు..

వేములవాడ రాజన్నను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు కొంకటి లక్ష్మీనారాయణ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆయనకు ప్రత్యేక దర్శన అవకాశం కల్పించారు. ప్రొటోకాల్ ఏఈవో అశోక్ శాలువాతో సత్కరించి, ప్రసాదం అందజేశారు.

ఇంటి పెద్దను ఇంటికి రప్పించండి


భూమేశ్వర్


ప్రవాసి ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న కుటుంబసభ్యులు

జగిత్యాలక్రైం: కుటుంబ బాధ్యతలకు భయపడి, ముగ్గురు ఆడ పిల్లల పెళ్లిళ్లు చేయలేననే మానసిక ఒత్తిడితో స్వదేశానికి రాకుండా పదేళ్లుగా సౌదీలో తలదాచుకుంటున్న ఓ గల్ఫ్ కార్మికుడిని స్వదేశానికి రప్పించాలని శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రవాసి ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. వివరాలు.. జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం దమ్మన్నపేటకు చెందిన గూడూరి భూమేశ్వర్ ఏప్రిల్ 2014లో సౌదీ వెళ్లాడు. అప్పటి నుంచి ఫోన్ చేయకపోవడం లేదని, అసలు బతికి ఉన్నాడో లేదో తెలియని పరిస్థితిలో తానూ, తన ముగ్గురు కూతుళ్లు తీవ్ర మానసిక క్షోభ అనుభవించామని భార్య లత ఆవేదన వ్యక్తం చేశారు. సౌదీలో ఉన్న తమ గ్రామస్తులు, తెలిసినవారు ఇటీవల అతన్ని ముహాయిల్ అభా ప్రాంతంలో వెతికి జాడ తెలుసుకున్నారని, ఇండియాకు రావడానికి విముఖత చూపుతున్నాడని వాపోయింది. తన ముగ్గురు కూతుళ్లు మౌనిక, మానస, సహస్ర తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సీఎం రేవంత్‌రెడ్డి, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ తీసుకుని తన భర్తను సౌదీ నుంచి ఇండియాకు రప్పించాలని, తమ పిల్లల చదువుకు సహాయం చేయాలని విజ్ఞప్తి చేసింది. ఆమె వెంట ఎమిగ్రంట్స్ వెల్ఫేర్ ఫోరం అధ్యక్షుడు మంద భీంరెడ్డి, టీపీసీసీ ఎన్‌ఆర్‌ఐ సెల్ అడ్వయిజర్ బొజ్జ అమరేందర్‌రెడ్డి, తిప్పర్తి పుల్లయ్య చారి ఉన్నారు.

వెన్కెపల్లి యువకుడి అదృశ్యం

- సైబర్ నేరగాళ్లను నమ్మి, రూ.8.50 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేసినట్లు సమాచారం


శ్రీకాంత్

సైదాపూర్: సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మిన ఓ యువకుడు వారు చెప్పిన ఖాతాకు రూ.8.50 లక్షలు పంపించినట్లు సమాచారం. తర్వాత అతను అదృశ్యమయ్యాడు. పోలీసుల వివరాల ప్రకారం.. సైదాపూర్ మండలంలోని వెన్కెపల్లికి చెందిన కామారపు శ్రీకాంత్ స్థానిక విశాల సహకార సంఘంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఇతను సైబర్ నేరగాళ్ల మాయలో చిక్కుకున్నాడు. రూ.5 లక్షలు చెల్లిస్తే, మూడు నెలలకే ఆ డబ్బుకు రూ.30 వేలు కలిపి ఇస్తామని, రూ.15 లక్షలు చెల్లిస్తే రూ.40 లక్షలు ఇస్తామని ఆశ చూపారు. నిరుపేద కుటుంబం కావడంతో తమ పేదరికం పోతుందని శ్రీకాంత్ భావించాడు. బంధువులు, స్నేహితులు, తనకు తెలిసినవారి వద్ద రూ.లక్షల్లో అప్పులు చేసినట్లు సమాచారం. ఈ నెల 17న సైదాపూర్ కేడీసీసీ బ్యాంకు నుంచి తన అకౌంట్ నంబర్ 20272201006000 ద్వారా ఎస్‌బీఐ గోరక్‌పూర్ బ్రాంచి, జ్యోతిదేవి అకౌంట్ నంబర్ 38080484767కు రూ.8.50 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేసినట్లు తెలిసింది. గురువారం ఉదయం 11 గంటలకు బైక్‌పై వెళ్లిన శ్రీకాంత్ తిరిగి ఇంటికి రాలేదు. ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో అతని తల్లి బుచ్చవ్వ శుక్రవారం ఠాణాలో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.